

బాల కార్మికుల నిర్మూలనకు

జిల్లాలో నెల రోజులు స్పెషల్ డ్రైవ్

- కార్మిక శాఖ జిల్లా ఇంచార్జ్ సుజాత

ప్రజాశక్తి-పాడేరు: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన మాసోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 30వ తేదీ వరకు అనుబంధ శాఖల సమన్వయంతో జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కార్మిక శాఖ జిల్లా ఇన్చార్జ్ సుజాత వెల్లడించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన మాసోత్సవాల నిర్వహణలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలను శుక్రవారం ఆమె ఇక్కడ విలేకరులకు ఒక ప్రకటన లో తెలియజేశారు. 14 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టకూడదని చెప్పారు. ఈ విధంగా బాల కార్మికులతో పని చేయించుకుంటున్న యాజమాన్యా లను గుర్తించి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 14 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోకూడదని ఈ సందర్భంగా ఆమె సూచించారు. బాల కార్మికులను విముక్తి చేయడం కోసం జిల్లా వ్యాప్తంగా ఈ నెల రోజులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు.

ఫిర్యాదులను పరిష్కరించండి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: స్పందనలో అందిన ప్రతి ఫిర్యాదును విచారణ చేసి పరిష్కరించాలని జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఫిర్యాదును విచారణ నిర్వహించేందుకు ఒక విచారణ అధికారిని నియమించాలని, అనంతరం తగు పరిష్కారం చేయాలని సూచించారు. శుక్రవారం స్పందన కార్యక్రమం ద్వారా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి 96 ఫిర్యాదులను స్వీకరించారు.కొయ్యూరు మండలం బూదరాళ్ళ పంచాయతి గొర్రెల మెట్ట నుండి అన్నవరం గ్రామానికి రోడ్డు నిర్మించాలని ఆ గ్రామ గిరిజనులు కోరారు. తన కుమార్తె మెడిషన్ చదవడానికి ఆశక్తి ఉన్నప్పటికీ స్థోమత లేనందున విశాఖపట్నం కార్పోరేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివించటానికి ఆర్థికంగా సహాయం చేయాలని పాడేరు మండలం గుత్తులపుట్ట గ్రామానికి చెందిన కే.రోజారమణి దరఖాస్తు సమర్పించారు. కొయ్యూరు మండలం మటంభీమవరం పంచాయతి కొమ్మనూరు, ఉడుత గ్రామాలకు చెందిన 35 మంది చిన్నారులు, 12 మంది గర్భిణీలు నివాసం ఉంటున్న తమ గ్రామానికి అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేయాలని ఆయా గ్రామ ప్రజలు వినతి సమర్పించారు. పాడేరు మండలం వి.కొత్తూరు గ్రామానికి సరైన రహదారి లేక పిల్లలు పాఠశాలకు, పంటలను సంతలను తీసుకెళ్లేందుకు, రేషన్ బియ్యం వాహనం రావడానికి సమస్యలు ఎదురవుతున్నాయని వి.కొత్తూరు గ్రామ సమన్వయ సంఘం అభ్యర్థించింది. పాడేరు మండలం గిరిజన రైతు తనకు వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా పవర్ వీడర్ సబ్సిడీ పై సరఫరా చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. పాడేరు మండలం గొట్టులపుట్టు పంచాయతి గోపాలపురం గ్రామానికి చెందిన వంతల లక్ష్మణబాబు తనకు కేటాయించిన అటవీ హక్కు భూమిలో సిల్వర్ ఓక్ చెట్లు, మిరియాలు, కాఫీ సాగు గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేసినందున, భాద్యులను గుర్తించి శిక్షించాలని, తనకు నష్ట పరిహారం అందజేయాలని కోరుతూ దరఖాస్తు చేసారు.

రూ.1.24 కోట్ల బ్యాంకు లింకేజి

స్పందన కార్యక్రమంలో భాగంగా కొయ్యూరు మండలం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆధ్వర్యంలో కోయ్యురుకు చెందిన 48 మహిళా సంఘాలకు రూ.1.24 కోట్ల బ్యాంకు లింకేజి చెక్కును జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ లబ్దిదారులకు అందజేశారు. మహిళా సంఘాలు బ్యాంకు లింకేజిని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కలక్టర్ కోరారు.

ఐటిడిఎ క్వార్టర్లలో నివాసం ఉంటున్న పలువురు అధికారులు, ఉద్యోగులు గత కొంత కాలంగా క్వార్టర్ అద్దె చెల్లించలేదని, ఈ మేరకు కొన్ని నెలలుగా అద్దె వసూలు కానందున సుమారు రూ. 8.5 లక్షలు బకాయిలు పేరుకు పోయాయని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ తెలిపారు. బకాయి అద్దెలు చెల్లించాలని ఆదేశించారు. కలక్టర్ స్పందిస్తూ అత్యధిక కాలంగా బకాయిలు చెల్లించని వారి క్వార్టర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో సంయుక్త కలక్టర్ జే. శివశ్రీనివాసు, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, సహాయ కలక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డిఆర్ఓ పి. అంబేద్కర్, వివిధ శాఖల జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న గిరిజనులు

రోడ్డు సౌకర్యం కల్పించాలి

- గిరిజనుల వేడుకోలు

ప్రజాశక్తి-హుకుంపేట: నూతనంగా రహదారి నిర్మాణం చేపట్టాలని మండలంలోని బూర్జ పంచాయతీ 5 గ్రామ ప్రజలు విన్నవించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ, సులిపకన్ నుంచి వాలసి వరకు నూతనంగా రహదారి నిర్మించాలని గ్రామ ప్రజలు కోరారు. ఈ రహదారి గుండా 5గ్రామాల ప్రజలు రాక పోకలు సాగిస్తుంటారని తెలిపారు. ఎగ సలతంగి, డిగ సలతంగి, కొండయ్ పాడు, సునిపాకన్, సొంటర్ల పాడు గ్రామాల ప్రజలు ఈ రహదారి మీదుగా 2 కిలోమీటర్ల దూరంగా తగ్గడంతో వాలసి నిమ్మల పాడుకు వెళుతుంటారన్నారు. రహదారి నిర్మాణం చేపట్టక పోవడంతో శుక్రవారం పాడేరు స్పందలో జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు చేశామని వారు తెలిపారు.



హాజరైన రేంజర్, సిబ్బంది

అటవీ శాఖ ఆధ్వర్యాన క్లీన్ అండ్ గ్రీన్

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న మిషన్ లైఫ్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం మండలంలోని అంజోడ ఫారంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ఫారంలోనున్న చెత్త చెదారాన్ని రేంజర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆ శాఖ సిబ్బంది పూర్తిగా తొలగించారు.ఈ సందర్భంగా రేంజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎకో టూరిజం పేరిట అభివృద్ధి పరిచి పర్యాటకులకు ఆహ్లాదం కలిగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు కృష్ణంనాయుడు, పోతురాజు పడల్, రామారావు, భాస్కరరావు, ఉద్ధంగి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

పేదలకు సకాలంలో వైద్య సేవలు

వైద్యాధికారులను ఆదేశించిన ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి - రంపచోడవరం

ఏజెన్సీలోని పేదలందరికీ సకాలంలో వైద్య సేవలు అందించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో నుండి రంపచోడవరం, చింతూరు డివిజన్ పరిధిలోని 11 మండలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా గ్రామాలలో ప్రతి ఇంటికీ వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను కనుగొని తగు వైద్య సేవలు అందించాలని కోరారు. బిపి, షుగర్, టీబీ, కేన్సర్ వ్యాధులు ఉన్న వారిని గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా ఐడి ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు వైద్యాధికారులు, సిబ్బంది ఆయా గ్రామాలలో పర్యటించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. నెలలు నిండిన వెంటనే 15 రోజుల ముందే గర్భిణులను సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వెయిటింగ్ హాల్లో జాయిన్ చేసుకోవాలన్నారు. ప్రతి ఏ పిహెచ్‌సిలో ఎంత మంది గర్భిణులు ఉన్నది ఆరా తీశారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. డెంగీ, మలేరియా ప్రబలకుండా దోమల నివారణకు మందు పిచికారి చేయాలన్నారు. దోమల నివారణ మందు పిచికారి రిపోర్టులు ఎప్పటికప్పుడు సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ అనూష, అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ పుల్లయ్య, డాక్టర్ రాధిక, ఎఎంఒ నక్క వెంకటేశ్వరరావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.



ట్రాక్టర్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

రైతులకు ట్రాక్టర్ల పంపిణీ

ప్రజాశక్తి - రంపచోడవరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో వైయస్సార్ యంత్ర సేవ పథకం ద్వారా రైతులకు ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను శుక్రవారం పంపిణీ స్థానిక ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజన రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు యంత్ర సేవా పథకం ద్వారా ట్రాక్టర్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో రూ.1,27,27,245 వ్యయంతో 13 ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు గిరిజన రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఒక్కొక్క ట్రాక్టర్ ఖరీదు రూ.7.50 లక్షలు కాగా, 40 శాతం సబ్సిడీపై రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఒక్కొక్క ట్రాక్టరుకు ఐదుగురు గిరిజన రైతులు సభ్యులుగా ఉంటారని, దాని ద్వారా వచ్చిన ఆదాయం వాయిదాల పద్ధతిలో కట్టవలసి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు బంధం శ్రీదేవి, కుంజం మురళి, జెడ్పిటిసిలు పండ వెంకటలక్ష్మి, కృష్ణవేణి, వైస్ ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండ కుమారి, రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జయ్య, సర్పంచుల సమైక్య అధ్యక్షులు కోసు రమేష్ బాబు, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, తుర్రం వెంకటేశ్వర్లు దొర, కుంజం వంశి, వడగల ప్రసాద్, డొక్కులూరి రత్నరాజు, పోలోజ్ కాంతం, పండ రామకృష్ణ, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్‌కెవి.చౌదరి, మండల వ్యవసాయ శాఖ అధికారులు కంటికూరి లక్ష్మణ్, ఆర్.ప్రశాంతి, ఉద్యానవన శాఖ అధికారి రమేష్, పి.రూతు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వినియోగదారులకు ప్రత్యేక రక్షణ చట్టం

ప్రజాశక్తి- అరకు లోయ : వస్తువులు కొన్నప్పుడు మోసపోతున్న గిరిజన వినియోగదారుల రక్షణ కోసం ప్రత్యేకంగా వినియోగదారుల చట్టం అవసరమని వినియోగదారుల వివాదాల కమిషన్ -2 జడ్జి జి.వెంకటేశ్వరి తెలిపారు. అరకులోయ అక్షయ్ ఇన్ హోటల్ లో జిల్లా వినియోగదారుల సంఘాల సమైక్య చైర్మన్ మర్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటెన్సిప్ ట్రైబల్ ప్రోగ్రాంలో బాగంగా వినియోగదారుల రక్షణ చట్టం 2019 పై శిక్షణ కార్యక్రమం గిరిజన వినియోగదారుల సంఘాలకు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి వెంకటేశ్వరి మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులు అనేకమంది మోసపోతున్నారని, ఇంటెన్సిప్ వాలంటీర్ల ద్వారా ఉమ్మడి జిల్లాలో చేసిన సర్వేలో వెల్లడైందన్నారు. ఈ నివేదికలను రాష్ట్ర వినియోగదారుల వివాదాల కమిషన్ కు నివేదిస్తామన్నారు. గిరిజన వినియోగదారుల ప్రత్యేక చట్టం అవసరమని రాష్ట్ర వినియోగదారుల కమిషన్ కు నివేదిస్తామని ఆమె అన్నారు.గిరిజన వినియోగదారులు నేరుగా వినియోగదారుల వివాదాల కమిషన్కు ఫిర్యాదు చేసే విధంగా ఒక ఫామ్ ను తయారు చేయనున్నట్లు అన్నారు. ప్రత్యేకమైన అవగాహన సదస్సులు ప్రభుత్వ అనుమతి తీసుకొని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సర్, ప్రత్యేక అధికారి లాజపతి రాయ్, అరకులోయ డిప్యూటీ తహసిల్దార్ దొన్ను, కమిషన్ మెంబర్ రమణ బాబు, అరకు వినియోగదారుల సంగం అధ్యక్షులు సమర్ధి రఘునాథ్, బూర్జ లక్ష్మి, వినియోగదారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వినియోగదారుల వివాదాల కమిషన్ 2 జడ్జి వెంకటేశ్వరి



మాట్లాడుతున్న ఎఎస్‌పి

సారా రవాణా చేస్తే చర్యలు

- ఎఎస్‌పి ధీరజ్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అనధికారికంగా మద్యం బాటిళ్ళు, సారాను రవాణా చేసి విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పదని అల్లూరి సీతారామరాజు జిల్లా ఏఎస్పీ ధీరజ్ హెచ్చరించారు. శుక్రవారం అరకులోయ మండల కేంద్రంలో పర్యటించిన ఆయన అరకు సర్కిల్ పరిధిలోని అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లో పట్టుబడ్డ మద్యం బాటిలు, నాటు సారాను అరకులోయ పోలీస్ స్టేషన్ సమీపంలోని రోడ్లు భవనాల లేఅవుట్లో రెవెన్యూ అధికారుల సమక్షంలో ధ్వంసం చేశారు. అనధికార ఐడి అరక్‌ల తయారీలో ఎవరైనా ప్రమేయం ఉన్నట్లు తెలిస్తే అటువంటి వారిని అదుపులోకి తీసుకుని ఆరేళ్లు జైలు శిక్ష విధించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అరకులోయ సర్కిల్ ఇన్స్పెక్టర్ రుద్రశేఖర్, అరకులోయ ఎస్సై ఆర్.సంతోష్, అనంతగిరి ఎస్సై రాము, డుంబ్రిగుడ ఎస్సై సంతోష్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు జిల్లా పౌర సరఫరాల సంస్థ లో అకౌంటెంట్ గ్రేడ్-3 పోస్టులో కాంట్రాక్టు పద్ధతిలో పని చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు సంయుక్త కలెక్టర్ జె. శివ శ్రీనివాసు ఒక ప్రకటనలో తెలిపారు. సిఎ లేదా సిఎంఎలో సెమీ క్వాలిఫైడ్ ఆయా కోర్సుల్లో ఇంటర్ ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రతిభ ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని జెసి వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు కలెక్టరేట్‌లోని పౌరసరఫరాల కార్యాలయం నుండి దరఖాస్తులు పొంది పూర్తి చేసి ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 2 గంటల లోపు కార్యాలయంలో అందించాలని జెసి సూచించారు.

మేనేజర్ ఉద్యోగాలకు..

పాడేరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్కిల్ డెవలప్మెంట్, ట్రైనింగ్ డిపార్ట్మెంట్ ద్వారా అరకు వ్యాలీ స్కిల్ కాలేజీ (వై టి సి) లో ఫుడ్ అవుట్ లెట్ మేనేజర్ ఉద్యోగానికి శిక్షణ పొందుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు వెలుగు జాబ్స్ కోఆర్డినేటర్ ఎస్.శ్యాంసన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు ఐదు నెలల శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి అభ్యర్థికి రెండు జతల యూనిఫాం, బూట్లు, ట్యాగ్, తదితర శిక్షణ సామగ్రిని అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం ఉద్యోగం కల్పించబడుతుందని తెలిపారు. నెలకు 20వేల రూపాయల జీతంతో పాటు ఇతర సదుపాయాలు కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసి వయస్సు 18 నుంచి 35 ఏళ్ల లోపు ఉన్న అభ్యర్థులు ఈ శిక్షణకు ఉద్యోగానికి అర్హులని తెలిపారు. అన్ని కేటగిరీల అభ్యర్థులకు అవకాశం ఉందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు తీసుకుని ఈనెల 5న సోమవారం అరకు లోయలోని స్కిల్ కాలేజీ (వై టి సి) వద్దకు హాజరు కావాలని, పూర్తి సమాచారంకు పోన్:949282 1420, 8985487061 నెంబర్లకు అభ్యర్థులు సంప్రదించాలని కోరారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలపై

మహా పాదయాత్రను జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేశ్వరరావు



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ప్రజాశక్తి-ఎటపాక

పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలంటూ సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుండి చేపడుతున్న మహా పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని నందిగామలో శుక్రవారం మహా పాదయాత్ర సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం నిర్మాణం ప్రారంభించి 18 సంవత్సరాలు గడుస్తున్నా నిర్వాసితులకు ఇప్పటికీ ఏ ఒక్కరికీ సంపూర్ణ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జరుగుతుందన్న గ్యారెంటీ కూడా ప్రభుత్వాలు ఇవ్వలేకపోతున్నాయని విమర్శించారు. 2022 జులైలో వరద బీభత్సం నుండి ప్రజలు ఇప్పటికీ కోలుకోలేకపోతున్నారని, ప్రభుత్వం శాశ్వత పరిష్కార మార్గం చూపెట్టలేకపోతుందని పేర్కొన్నారు. అప్పటి వరదలలో ముంపునకు గురైన గ్రామాల్లో ప్రతి కుటుంబాన్ని పోలవరం ముంపు జాబితాలో చేర్చి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు 45.72 మీటర్లకు నిర్మాణ చేపడుతూ, పునరావాసం 41.15 మీటర్ల ముంపు వరకే చెల్లిస్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించడం దారుణమన్నారు. పోలవరం నిర్వాసితులందరూ ఒకే తాటిపైకి వచ్చి ఉద్యమం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఐవి, నాయకులు సొందే రామారావు, కారం జయమ్మ, పులుసు సూర్యనారాయణ, సోయం పెదబాబు పాల్గొన్నారు.

పెరిగిన భూముల ధరలకు అనుగుణంగా నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి

కూనవరం : మండలంలోని ఆర్యూర్‌లో జరిగిన మహాపాత్ర యాత్ర సన్నాహక సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతరామయ్య మాట్లాడుతూ వచ్చే ఏడాది కల్ల పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని అంటున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందు ప్రాజెక్టు కింద ముంపునకు గురవుతున్న భూములకు, ఇళ్లకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భూములు ధరలు పెంచిందని, అందుకు అనుగుణంగా ముంపు భూములకు ఎకరాకు రూ.30లక్షల నుండి రూ.50 లక్షలకు పెంచి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రాజెక్టు దిగువున వున్న భూములకు ధరలు పెంచి, అదే ప్రాజెక్టు వల్ల ముంపునకు గురవుతున్న భూములకు పెంచకపోవడం అన్యాయమన్నారు. దీనిపై పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, పాయం సత్యనారాయణ, తాళ్లూరి శ్రీనివాసరావు, కర్నాటి శ్రీనివాసరావు, ఆవుల మురళి, ఆవుల ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహా పాదయాత్రపై జోరుగా ప్రచారం

విఆర్.పురం : పోలవరం నిర్వాసితుల సమస్యలపై ఈ నెల 20న మండలంలోని రేఖపల్లిలో ప్రారంభం కానున్న మహా పాదయాత్రను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని జీడిగుప్ప, ములకపల్లి, కోటారి గొమ్ము గ్రామాల్లో సిపిఎం నాయకులు శుక్రవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వల్ల, గోదావరి వరదల వల్ల మునిగిపోతున్న ప్రతి గ్రామానికి మొదటి ప్రాధాన్యతగా తీసుకొని అందరికీ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ప్యాకేజీ, పునరావాసం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వడ్లడి రమేష్, కుంజా నాగిరెడ్డి, కథల కొండారెడ్డి, కథల రామిరెడ్డి, వల్లా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న సిపిఎం విఆర్.పురం మండల కార్యదర్శి చిన్నబాబు



మాట్లాడుతున్న డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్

పంచాయతీల ఆదాయం పెంచాలి

ప్రజాశక్తి - రంపచోడవరం

గ్రామ పంచాయతీల ఆదాయం పెంపునకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి జిఎల్ఎన్‌వి.రాఘవన్ ఆదేశించారు. రంపచోడవరం డివిజన్‌లోని 7 మండలాల పంచాయతీ విస్తరణ అధికారులు, పంచాయతీల కార్యదర్శులతో స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నుల బకాయిలు వెంటనే వసూలు చేయాలని, కొలగారం వేయాలని, పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని, పంచాయతీ రికార్డులు నిర్వహణ, గ్రామ పంచాయతీ ప్రాపర్టీ రిజిస్టర్ తయారీ, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ షెడ్‌లు సక్రమంగా నిర్వహించడంపై పలు సూచనలు చేశారు. జిల్లా టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అనిత పంచాయతీల్లో భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి అవగాహన కల్పించారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సహాయం

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని కుమ్మూరు గ్రామ పంచాయతీ మామిళ్లగూడెం ఆవాసానికి చెందిన శ్యామల రాధ ఇల్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో దగ్ధం కావడంతో ఆమె కుటుంబానికి శుక్రవారం టిడిపి నాయకులు బట్టలు, గిన్నెలు, నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇళ్ల చిన్నారెడ్డి, మల్లెల వెంకటేశ్వరరావు, నాయకులు ఓబులేని రామారావు చౌదరి, సాల్మన్ రాజు, అని చంద్రయ్య, అని బాబు, శ్యామల జయ, శ్యామల భాస్కర్, శ్యామల రమేష్, వంజం తమ్మయ్య పాల్గొన్నారు.



సహాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

అందని బిఎస్ఎన్ఎల్ సిగ్నల్

ఇబ్బంది పడుతున్న వినియోగదారులు

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం సీలేరులో బిఎస్ఎన్ఎల్ 2జి సిగ్నల్స్ సక్రమంగా వినియోగదారులకు అందకపోవడంతో అనేక ఇబ్బందులు గురవుతున్నారు. 25 రోజుల నుంచి సెల్ సిగ్నల్స్ వచ్చిపోతూ ఉండడంతో వినియోగదారుల సమాచార వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బిఎస్ఎన్ఎల్ సిబ్బంది స్థానికంగా ఉండకపోవడంతో ఇటువంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. బిఎస్ఎన్ఎల్ నెట్ సౌకర్యం కూడా అంతంత మాత్రమే పనిచేస్తుంది. 2జి సెల్ ఫోన్లకు సిగ్నల్స్ అందకపోవడంతో వినియోగదారులు మరిన్ని ఇబ్బందులకు గురి కావలసిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా బిఎస్ఎన్ఎల్ అధికారులు సాంకేతిక లోపాలపై దృష్టి సారించి పూర్తిస్థాయిలో సెల్ సిగ్నల్స్ అందుబాటులో వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణారావు



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -హుకుంపేట:గిరిజన సంఘం రాష్ట్ర ఎనిమిదో మహాసభలను జయప్రదం చేయాలని గిరిజన సంఘం అల్లూరి జిల్లా ఉపాధ్యక్షులు తాపుల కృష్ణారావు కోరారు. ఈనెల నెల 8, 9 తేదీల్లో అరకు వేలిలో నిర్వహించే గిరిజన సంఘం 8వ రాష్ట్ర మహాసభల సందర్భంగా హుకుంపేటలో స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో శుక్రవారం జెండా ఆవిష్కరించారు. గిరిజన హక్కులు, చట్టాల ఉల్లంఘనను గురవకుండా కాపాడుకుందాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరంతరం గిరిజనుల సమస్యలపై గిరిజన సంఘం పోరాటం సాగిస్తుందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసుల హక్కులు, చట్టాలపై పోరాటం చేస్తున్నారు. ఈ మహాసభలకు మండలంలో నాయకులు, ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మాజీ మండల కార్యదర్శి కొర్రా ఆనంద్, సిఐటియు మండల కార్యదర్శి బి.అప్పలకొండ పడాల్ పాల్గొన్నారు.

బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ

సంతలో సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ పిసిసి ప్రతినిధి చిన్నస్వామి ఆధ్వర్యంలో అరకు వారపు సంతలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందిన వారిని చేర్చడంతో గిరిజనులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.వారపు సంతలో పలు సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి టి భీమరావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జి మదనరావు, నాయకులు రాము పాల్గొన్నారు.

4న సత్యనారాయణ స్వామి వ్రతం

ప్రజాశక్తి -పాడేరు: పట్టణంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 4న టీటీడీ దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, టీటీడీ తలపెట్టిన ఈ సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో భక్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. భక్తులు వ్రత సామగ్రిని తీసుకుని ఆలయానికి హాజరు కావాలన్నారు.



చేపలవేటలో నిమగ్నమైన గిరిజనులు

సమిష్టిగా చేపల వేట

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు ఏజెన్సీలోని గిరిజనులు బతుకు బాటలో భాగంగా సమిష్టిగా చేపల వేట సాగిస్తున్నారు. కేవలం వర్షాలపైనే ఆధారపడి వ్యవసాయం చేయడం వల్ల ప్రస్తుతం గిరిజనులకు ఏ పనుల్లేవు. బీడీ తునికాకు సీజన్ కూడా ముగియటంతో గిరిజనులు సమిష్టిగా సమీప చెరువుల్లో వలలు పట్టుకొని చేపల వేటకు వెళ్తున్నారు. చెరువుల్లో భయంకరమైన జలగలు, నీటి పాములు ఉన్నా వాటికి భయపడకుండా ధైర్యంగా వేట కొనసాగిస్తున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు విసురు వలలు చెరువులో విసురుతూ వలకు చిక్కిన చిన్న పెద్ద చేపలను తెస్తున్నారు. వాటిని పోగులుగా వేసి అందరూ సమిష్టిగా పంచుకుంటున్నారు. సమిష్టి తత్వానికి, ఐకమత్యానికి ఇది ఒక తార్కానంగా ఉంటుంది. ఏజెన్సీలో సాంప్రదాయ బద్దంగా పూర్వం నుండి వస్తున్న ఆచారానికి కట్టుబడి ఉంటారు ఇక్కడి గిరిజనులు.

కెజిహెచ్ రోగులను ప్రైవేటుకు తరలిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కెజిహెచ్‌కు వచ్చే రోగులను ప్రైవేట్ క్లినిక్స్‌కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అటువంటి క్లినిక్‌ల గుర్తింపు రద్దు చేస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున హెచ్చరించారు. కెజిహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో శుక్రవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పలు మార్గదర్శకాలు జారీ చేశారు. ఆసుపత్రి అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ముందుగా హెచ్ఒడిలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పలు విభాగాధిపతులు తమకు కావలిసిన మౌలిక వసతులు, మెడికల్ సామగ్రి వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కమిటీకి వివరించి, పూర్తిచేసిన పనుల వివరాలు తెలిపారు. శుక్రవారం జరిగిన కమిటీ సమావేశంలో మల్లికార్జున 15 పనులుగాకు సుమారు రూ.కోటీ 10 లక్షలకు, వైద్య పరికరాల నిమిత్తం రూ. కోటికి ఆమోదం తెలిపారు. ఆసుపత్రికి అవసరమైన వనరులపై చర్చించారు. కెజిహెచ్‌లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. సమావేశం అనంతరం నర్సింగ్ సిబ్బంది తమకు కల్పించిన సౌకర్యాల పట్ల సంతృప్తి చెంది కలెక్టర్‌కు సన్మానం చేశారు. సమావేశంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఎపిఎంఎస్ఐడిసి ఇఇ బిఎ.నాయుడు, కమిటీ సభ్యులు, వైద్యాధికారులు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

5 నుంచి ఎకో-వైజాగ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 5న ఎకో వైజాగ్ పేరుతో ఒక వినూత్న కార్యక్రమం చేపట్టబోతున్నామని జివిఎంసి కమిషనర్ సిఎం సాయి కాంత్ వర్మ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మేయర్ హరి వెంకట కుమారి ఆ రోజు సాయంత్రం ఆర్‌కె.బీచ్‌లో ప్రారంభిస్తారని తెలిపారు. శుక్రవారం సాయంత్రం జివిఎంసి కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ 2022లో దేశవ్యాప్తంగా 4355 నగరాలతో పోటీపడి విశాఖ నగరం నాలుగో స్థానంలో నిలిచిందని, ఆ విజయానికి కొనసాగింపుగా విశాఖ నగరాన్ని మరింత మెరుగు పరచడం కోసం ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భావితరాల భవిష్యత్తుతో పాటు మానవ మనుగడకు అత్యంత కీలకమైన ఐదు అంశాలకు ప్రాధాన్యతనిస్తున్నట్టు పేర్కొన్నారు. పరిసరాల శుభ్రత, పర్యావరణాన్ని కాపాడటం, నీటి సంరక్షణ, బీచ్ క్లీనింగ్, ఇంకుడు గుంతలు తవ్వడం వీటిలో ముఖ్యమైనవన్నారు. ఇకో వైజాగ్ కార్యక్రమంలో పొందుపరిచిన ఐదు అంశాలను అమలుపరిచేందుకు 10 ఎన్‌ఫోర్సుమెంట్ వెహికల్స్‌ను ఆ రోజు సభా వేదిక వద్ద ప్రారంభిస్తామన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

అనంతగిరి మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిపి, జెడ్‌పిటిసి



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి:అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే మండలం అభివృద్ధి సాధ్య పడుతుందని జెడ్పిటిసి, ఎంపీపీలు తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ శెట్టి. నీలవేణి అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై గతంలో జరిగిన సమావేశాల్లో చర్చించిన పలు సమస్యలపై క్లుప్తంగా వివరించాలని చెప్పారు. జెడ్పిటిసి దీసరి. గంగరాజు మాట్లాడుతూ,ఇప్పటికే మండలంలోని అనేక మారుమూల గ్రామాల్లో పాడేరు కనెక్టివిటీ పథకం కింద రోడ్లు మంజూరుకు తాము ఎంతో కృషి చేశామని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు పనుల పర్యవేక్షణ, నాణ్యత వంటి వాటిపై పర్యవేక్షించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులు, ఆటంకాలపై తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.అనంతరం శాఖల వారీగా ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. అధికారులు చెప్పిన పలు విషయాలను ప్రజాప్రతినిధులు నిలదీశారు. అధికారులు ఆ విషయాలపై సరైన సమాధానం ఇవ్వక పోవడంతో సభ్యులు ఆగ్రహ వ్యక్తం చేశారు. ప్రస్తుతం వ్యవసాయ, ఎపిడమిక్ సీజన్ కారణంగా సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలని ప్రజాప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో తశీహాసిల్దార్, ఎంపీటీసీలు, సర్పంచ్ మొస్య, రూతు పాల్గొన్నారు.

'గీతం'లో డిఎస్‌టి సాంకేతిక విజ్ఞాన కేంద్రం



సాంకేతిక విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అతుల్ భట్

ప్రజాశక్తి- మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డిఎస్‌టి) ఆధ్వర్యంలో సాంకేతిక విజ్ఞాన కేంద్రం (జి-టెక్)ను విశాఖ స్టీల్‌ప్లాంట్ ఛైర్మన్ అతుల్ భట్ శుక్రవారం ప్రారంభించారు. స్థానిక పరిశ్రమలకు విద్యాలయాలకు మధ్య సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు నూతన సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి, నిరంతర శిక్షణ కార్యక్రమాల నిర్వహణ, చిన్న మధ్య తరహ పరిశ్రమలతో విద్యాలయాలను అనుసంధానం లక్ష్యంగా దీన్ని ఏర్పాటు చేశారు. గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, అన్నా విశ్వవిద్యాలయం డిఎస్‌టి శాస్త్రవేత్త డాక్టర్ పి.కృష్ణకాంత్, ఎపి మెడ్‌టెక్ జోన్ డైరక్టర్ మృత్యుంజయ జనా సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పరిశ్రమల ప్రతినిధులు, ఎమ్ఎస్ఎమ్ఇ నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఛైర్మన్ అతుల్ భట్ మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ రంగంలో డిజిటలైజేషన్, ఆటోమేషన్‌లకు ఇతర దేశాలపై ఆధారపడుతున్న నేపథ్యంలో స్వదేశీ పరిజ్ఞానం అభివృద్ధికి గీతంలోని జి-టెక్‌తో కలిసి పనిచేయడానికి ఆసక్తితో ఉన్నామన్నారు. విశ్వవిద్యాలయాలలో జరిగే పరిశోధనలు పరిశ్రమల అవసరాలను తీర్చేవిగా ఉండాలనిసూచించారు. గీతం అధ్యక్షుడు ఎమ్.భరత్ మాట్లాడుతూ గీతం విశ్వవిద్యాలయం ద్వారా నాణ్యతతో కూడిన పరిశోధనలు జరిపేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, స్థానిక పరిశ్రమల అవసరాలను తీర్చేలా అధ్యయనాలు ఉంటాయన్నారు.

గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం మాట్లాడుతూ జి-టెక్ విజ్ఞాన కేంద్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన పరిశోధకుల మధ్య బలమైన సంబంధాలను నెలకొల్పడానికి సదస్సులు, వర్క్‌షాప్‌లు, చర్చా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును గీతం డీమ్డ్‌విశ్వవిద్యాలయానికి అప్పగించడం పట్ల కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. డిఎస్‌టి శాస్త్రవేత్త డాక్టర్ పి.కృష్ణకాంత్ మాట్లాడుతూ దేశంలోని 22 విశ్వవిద్యాలయాలలో టెక్నాలజీ ఎనేబిలింగ్ కేంద్రాలను కేంద్ర శాస్త్ర సాంకేతిక విభాగం ఇప్పటి వరకు ఏర్పాటు చేసిందని, ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా గీతంలో రూ. 3.28 కోట్లతో ఏర్పాటైన జి-టెక్ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసి, గీతంతో పాటు రాష్ట్రంలోని సహ విద్యాసంస్థలను భాగస్వామ్యం చేసే విధంగా పని చేస్తుందన్నారు. వివిధ విద్యా సంస్థలలోని పరిశోధకుల నూతన ఆవిష్కరణలను గుర్తించడం వాటికి మార్కెటింగ్ అవకాశాలను తెలియజేయడంతో పాటు స్థానిక పరిశ్రమల సాంకేతిక అవసరాలను తెలుసుకుని వాటికి అవసరమైన నూతన పరిజ్ఞానాన్ని ప్రయోగశాలలో అభివృద్ధి చేయడంపై జి-టెక్ దృష్టి సారిస్తుందన్నారు. కార్యక్రమంలో గీతం కార్యదర్శి ఎమ్.భరద్వాజ, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, రీసెర్చి అండ్ డవలప్ సెల్ డైరక్టర్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు, ప్రోవైస్ ఛాన్సలర్‌లు, డీన్‌లు, సీనియర్ ప్రొఫెసర్‌లు పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణ ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి- సింహాచలం: రానున్న ఆషాడ పౌర్ణమి సందర్భంగా సింహాద్రి అప్పన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు, గిరి ప్రదక్షణ ఏర్పాట్లపై దేవస్థానం ఇఒ వి త్రినాధరావు ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గిరిప్రదక్షిణ రోజున కొండ చుట్టూ తిరిగే భక్తులకు ఎటువంటి ఇబ్బందు లేకుండా ఎక్కడెక్కడ మంచినీటి సదుపాయం, వసతి మెడికల్ క్యాంపులు పారిశుధ్యం నిర్వహణ, విద్యుత్ దీపాల అలంకరణ తదితర అంశాలపై చర్చించారు. విద్యుత్, పోలీసు, వైద్యం, రవాణా, జివిఎంసి, ఇతర అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడంపై చర్చించారు కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దొడ్డి రమణ, శ్రీదేవి, వర్మ, రామలక్ష్మి, పిల్ల జగన్మోహన్ పాత్రుడు, ు పలువురు సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు దేవస్థానం చెందిన వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు

మహిళా రెజ్లర్ల గోడు పట్టదా ?

ప్రధాని మోడీ తీరు శోచనీయం
తక్షణమే బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయండి
విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ప్రజా సంఘాలు డిమాండ్

తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ బిజెపి ఎంపీ, డబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయాలంటూ దేశ రాజధానిలో పోరాటం చేస్తున్న మహిళా రెజ్లర్లపై కేంద్ర ప్రభుత్వ నిర్బంధకాండను ఖండిస్తూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో శుక్రవారం పలు కార్యక్రమాలు జరిగాయి. రెజ్లర్లకు సంఘీభావంగా పెద్దపెట్టున ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు నినదించారు.



కొవ్వొత్తుల ప్రదర్శనలో వార్వా, నివాస్ నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బ్రిజ్ భూషన్ శరణ్ సింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎల్ఐసి బిల్డింగ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం వార్వా, నివాస్ ఆధ్వర్యాన కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంతర్జాతీయ పోటీల్లో పలు పతకాలు సాధించిన క్రీడాకారిణులు న్యాయం కోసం కొద్ది రోజులుగా రాజధానిలో పోరాడుతున్నారన్నారు. దోషులను శిక్షించడానికి బదులుగా శాంతియుత నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఆ బాధితులపై ఢిల్లీలో ఘోరంగా దాడి జరుగుతోందన్నారు. బ్రిజ్ భూషణ్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం, బాధిత రెజ్లర్లపై దాడులు చెయ్యడం అంతర్జాతీయంగా మన దేశ ప్రతిష్టను దిగజార్చినట్లయిందన్నారు. రెజ్లర్లపై పోలీసు చర్యను ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ, యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ సంస్థలు ఖండించిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో వార్వా ప్రధాన కార్యదర్శి బిబి.గణేష్, నివాస్ కార్యదర్శి పి.నారాయణమూర్తి, నాయకులు ఎన్.ప్రకాష్‌రావు, కెవి.రమణమూర్తి, జెపి.శర్మ, కెఎం.కుమార్ మంగళం, కె.సత్యవతి, ఎం.మోహన్‌రావు, కృష్ణమోహన్, ప్రభాకర్, నాయనబాబు, సంతోష్ పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలంటూ మహిళా చేతన ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం సంతకాల సేకరణ చేపట్టారు. నిరసన తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సంఘం ప్రధాన కార్యదర్శి కత్తి పద్మ మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఆర్ఎఫ్ నాయకులు అనురాధ, పికెఎస్ ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ, భారత నాస్తిక సమాజం నాయకులు వై.నూకరాజు, రాంప్రభు, సూరిబాబు, విజ్ఞానంద్ పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

ఉక్కునగరం : లైంగిక వేధింపులకు గురై, న్యాయం కోసం ఢిల్లీలో నెల రోజులుగా మహిళా రెజ్లర్లు ఆందోళన చేస్తున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని ఐద్వా స్టీల్ జోన్ నేతలు ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రెజ్లర్ల న్యాయపోరాటానికి సంఘీభావంగా శుక్రవారం సంఘం ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో మహిళలు నల్ల బ్యాడ్జీలు ధరించి పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జోన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.వరలక్ష్మి, వేణు మాట్లాడారు. బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం.విజయలక్ష్మి, పి.పుష్ప, కె.సుశీల, ఎ.సూర్యప్రభ, జి.శృతి, అనకాపల్లి నాయకులు పి మణికంఠ పాల్గొన్నారు.

పరస్పర సహకారంతోనే అభివృద్ధి

విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ రాఘవేంద్రరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఒక్కరి కోసం అందరం.. అందరి కోసం ఒక్కరు అనే సైద్ధాంతిక ప్రాతిపదికతో నడుస్తున్న విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని ఆ బ్యాంక్ ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు వినియోగదారులకు పిలుపునిచ్చారు. శుక్రవారం పోలమాంబ కల్యాణ మండపంలో నిర్వహించిన వాల్తేరు బ్రాంచి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ 108 ఏళ్లుగా నడుస్తున్న తమ బ్యాంకు అవసరమైన వారందరికీ తక్కువ వడ్డీకి రుణాలు అందించడంతోపాటు, డిపాజిట్‌దారుల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలను వివరించారు. దక్షిణ భారత దేశంలోనే అతిపెద్ద అర్బన్ బ్యాంకుగా ఉన్న తమ బ్యాంకు పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతి కోసం పని చేస్తోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు, ఆంక్షలు పెట్టినా.. ప్రజల నమ్మకంతో దినదినాభివృద్ధి సాధిస్తున్నటు తెలిపారు. రిజర్వు బ్యాంకు విధిస్తున్న ఆంక్షలు సహకార బ్యాంకుల అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నాయని సభ్యులకు వివరించారు. అయినా తమ బ్యాంకును లాభాల బాటలో నడిపించి ఆ సొమ్మును డివిడెండ్ రూపంలో సభ్యులకు పంచుతున్నామని తెలిపారు. సమావేశానికి అధ్యక్షత వహించిన డైరెక్టర్ పార్వతి దేవి బ్రాంచి పురోగతిని వివరించారు.

మరో డైరెక్టర్ జెవి.సత్యనారాయణ మూర్తి కో-ఆపరేటివ్ బ్యాంకులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలిపారు. బ్యాంకు సిఇఒ నరసింహ మూర్తి బ్యాంకు అందిస్తున్న సేవలను, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో బ్యాంకు సీనియర్ వైస్ ఛైర్మన్ గుడివాడ భాస్కరరావు, డైరెక్టర్లు కాకి భవాని, ఆదినారాయణ శాస్త్రి, బ్యాంకు జెడ్ఎం తిరుమలరావు, మేనేజర్ యుగంధర్, సిబ్బంది పాల్గొన్నారు.

5న చలో ఐటిడిఎ



నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలో గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టల్ వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయాలని ఈనెల 5న చలో ఐటిడిఏ నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా కమిటీ తెలిపింది. ఈ మేరకు సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకర్రావు మాట్లాడుతూ, హాస్టల్ వర్కర్లను వేసవి సెలవులు లేవని తెలిపారు.చాలీచాలని వేతనాలు ఇస్తున్నారని ప్రభుత్వంపై మండిపడ్డారు. హాస్టల్ లో పనిచేస్తూ మృతి చెందిన కార్మిక కుటుంబాలకు ఉద్యోగం అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.కనీస వేతనం చెల్లించాలని ఇవ్వాలని, వంట దగ్గర పనిచేసే కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఫేషియల్ ఎఫ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా అధ్యక్షురాలు విజయమ్మ పాల్గొన్నారు.


అక్రమ బదిలీని నిలిపేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అనంతగిరి ఏపీ టూరిజం రిసార్ట్స్‌లో పని చేస్తున్న లక్ష్మణ్‌పై వైసిపి నాయకులు వేధింపులకు గురి చేస్తున్నారని, ఇందులో భాగంగా ఎటువంటి కారణం లేకుండా కర్నూలు టూరిజం డివిజన్‌కి బదిలీ చేయడంపై సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు తప్పు పట్టారు. శుక్రవారం ఓ పత్రిక ప్రకటనలో ఖండించారు.

ఏపీ టూరిజం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై గత కొంతకాలంగా ఉద్యమిస్తున్నారని, చురుగ్గా పోరాటంలో పాల్గొంటున్న లక్ష్మణ్ పై స్థానిక వైసిపి నాయకులు కక్షపూరితంగా కర్నూలుకి బదిలీ చేయించారని ఆయన తెలిపారు. తక్షణం బదిలీని నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఏపీ టూరిజం వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని తెలిపారు.

అనారోగ్యంతో పాస్టర్ మృతి



పాస్టర్ జోషఫ్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి -హుకుంపేట:అనారోగ్యంతో జెసిఎఫ్ చర్చి పాస్టర్ బిషప్ పి. జోసఫ్ మృతి చెందారు. 1959 సంవత్సరం క్రితం హుకుంపేట గ్రామంలో మొదటి చర్చి నిర్మాణం చేసి అనేకమందికి దైవ సందేశం ఇస్తూ చెడు అలవాట్ల నుంచి దూరం చేశారు. ప్రేమను పంచి ఎన్నో కుటుంబలను పాస్టర్ ఆదుకున్నారు.ఎంతో మంది పేదలను ఆదరించి ఎన్నో సేవలు అందించారు. గతకొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతు విశాఖపట్నం అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు.

బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి- పెదబయలు: స్థానిక గిరిజన ఉద్యోగుల సంఘ భవనంలో వేసవి విజ్ఞాన వినోదం కార్యక్రమం స్థానిక ఉద్యోగుల సంఘం అధ్యక్షులు చెండా బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పలు రకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు చెండా బాలకృష్ణ, లక్ష్మినారాయణ, కే ఆదినారాయణ, ఆర్.చిన్నయ్య, బి.సాంబ మూర్తి, మత్యరాజు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - రంపచోడవరం : టిడిపి మహానాడులో చంద్రబాబు మినీ మేనిఫెస్టో పలు సంక్షేమ పథకాలు ప్రకటించిన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, సీతంశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన ఆ పార్టీ నాయకులు శుక్రవారం స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేసే మినీ మేనిఫెస్టో సంక్షేమ పథకాల వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు, నాయకులు పెంటపాటి అనంత మోహన్, మట్ట మెహర్ బాబా గౌడ్, గొర్లె సునీత, కారం సింహాచలం, దిడ్డి జనార్ధన్, కారం శాయమ్మ, సిద్ధ వెంకన్న దొర, మచ్చ అబ్బులు, బొడ్డేటి వీరబాబు, ధారా వెంకన్న, కుంజం బాపన్న దొర, బుడ్డిక రాజేంద్ర వరప్రసాద్, మడకం పండు దొర, సర్పంచ్ వంతల అచ్చియమ్మ, మాజీ సర్పంచ్ బొరగ సోమరాజు పాల్గొన్నారు.

నాటు సారా ధ్వంసం

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం డివిజన్ పరిధి దేవీపట్నం మండలంలో రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహల్లి ఆధ్వర్యంలో శుక్రవారం భారీగా నాటు సారా, బీరు బాటిళ్లను ధ్వంసం చేశారు. 19 కేసుల్లో సుమారు 275 లీటర్ల సారాను, మరో కేసులో ఉన్న బీరు బాటిళ్లను గోయ్యి తీసి అందులో పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో నాటు సారాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యువత వ్యసనాలకు బానిసై ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. నాటుసారా విక్రయాదారులు వేరే వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవీపట్నం ఎస్ఐ కెవి.నాగార్జున, వీఆర్వో జి.మోహిని, విఆర్ఎ విష్ణు, స్టేషన్ సిబ్బంది జి.సత్యనారాయణ, ఎస్‌వివి.సత్యనారాయణ, ధర్మరాజు, వెంకట్, సత్తిబాబు, ప్రతిభ భారతి, హోమ్ గార్డు ప్రభావతి, జగ్గారావు దొర పాల్గొన్నారు.

ఘనంగా ప్రకృతి వ్యవసాయ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : నగరంలోని గాదిరాజు ప్యాలస్‌లో ఎపి ప్రభుత్వం (రైతు సాధికార సంస్థ) ఆధ్వర్యాన శుక్రవారం ప్రకృతి మేళా (ఆర్గానిక్ వ్యవసాయ ప్రదర్శన) జరిగింది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, ఆర్‌వైఎస్ఎస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి.విజయ్‌కుమార్ ప్రారంభించారు. దీంట్లో రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన రైతులు, ఎన్‌జిఒలు, ఎంటర్‌ప్రెన్యూనర్‌లు, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు, దేశీయ వరి విత్తనాలు ఇలా పలురకాల ఉత్పత్తులను ప్రదర్శించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన పంటలు తినడం వల్ల ఆరోగ్యం కలుగుతుందని విజయ్‌కుమార్ వెల్లడించారు. కరోనా తర్వాత ఆరోగ్యంపై ప్రజల్లో ఆసక్తి పెరిగిందని అందుకు అనుగుణమైన ఉత్పత్తులవైపు దృష్టిసారించడంతో ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత పెరిగిందని, ఈ ప్రదర్శన అందుకు వేదికైందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి స్టేట్ మార్కెటింగ్ అధికారి టిఎల్.ప్రభాకర్, రీజనల్ ప్రకృతి వ్యవసాయ అధికారులు ఆర్‌పిసి కృష్ణారావు, ఆర్‌టిఎల్ ప్రకాష్‌రావు, ఆర్‌టిఒ హేమసుందర్, విశాఖ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, ఎఎస్ఆర్, పార్వతీపురం జిల్లాల ప్రాజెక్టు మేనేజర్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే సేవల మెరుగుకు కృషి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రైల్వే సేవలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నట్టు వాల్తేరు రైల్వే డిఆర్ఎం అనుప్ సత్పతి తెలిపారు. 118వ డివిజనల్ రైల్వే వినియోగదారుల కన్సల్టేటివ్ కమిటీ సమావేశం నగరంలోని డిఆర్ఎం కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.